క్లుప్తంగా

విడతల వారీగా అభివృద్ధి

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న లావణ్య

కొత్తూరు: విడతల వారీగా కొత్తూరు మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య పేర్కొన్నారు. బుధవారం ఆమె కౌన్సిలర్లతో కలిసి నాలుగోవార్డులో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ అభివృద్ధికి నిధులు సమకూర్చుకుని కౌన్సిల్ ఆమోదంతో అన్ని వార్డుల్లో పనులు చేపడతామన్నారు. నీటి సరఫరాలో అంతరాయం, డ్రైనేజీ వ్యవస్థలో ఇబ్బందులు ఉంటే ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్లు సోమ్లనాయక్, మాదారం నర్సింలుగౌడ్, కోస్గి శ్రీనివాస్, దేవేందర్‌యాదవ్, శ్రీను, జనార్దన్‌చారి, రాఘవేందర్‌యాదవ్, జె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన మేఘన

ఎంబీబీఎస్ సీటు సాధించిన షాద్‌నగర్ విద్యార్థిని



తల్లిదండ్రులతో విద్యార్థిని మేఘన

షాద్‌నగర్ రూరల్: పేదింటి విద్యార్థిని చదువుల్లో రాణించింది. జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షలో షాద్‌నగర్ విద్యార్థిని ఉత్తమ ర్యాంకు సాధించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో నివాసం ఉంటున్న బైరమోని రమేష్, మంజుల దంపతుల కూతురు మేఘన. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి ర్యాంకు కైవసం చేసుకుంది. అయితే తల్లిదండ్రులు పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఎదుట దోసా బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. మేఘన ఉన్నత చదువుల కోసం తల్లిదండ్రులు ఎంతో శ్రమించారన్నారు. కూతురు ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు సాధించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేఘనను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్ రూరల్: బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జిగా షాద్‌నగర్‌కు చెందిన దొడ్డి శ్రీనివాస్‌ను నియమించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రం శేఖర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జిగా దొడ్డి శ్రీనివాస్‌ను నియమించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. జిల్లా ఇన్‌చార్జిగా తనను నియమించినందుకు పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు

మార్కెట్ చైర్‌పర్సన్‌కు సన్మానం



చైర్‌పర్సన్ జ్యోతి దంపతులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: ఉమ్మడి పాలమూరు జిల్లా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా జ్యోతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల అధ్యక్షులు జగన్, ప్రభాకర్ రెడ్డి, డీసీసీ సభ్యులు భగవాన్‌రెడ్డి చైర్‌పర్సన్ జ్యోతి దంపతులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అంబాజీ, రవి, కృష్ణ, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: పూజలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాష్‌రెడ్డి తదితరులు



చేవెళ్ల: పూజలో పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి. ఆయా మండపాల వద్ద కుంకుమార్చన, హోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. షాద్‌నగర్‌లోని నెహ్రూనగర్ కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



షాద్‌నగర్: పూజలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: పూజలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య



షాబాద్: కుమ్మరిగూడలో అన్నదానం చేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి తదితరులు

దాత సహకారంతో రోడ్డుకు మరమ్మతులు

కేశంపేట: గుంతలమయంగా మారిన రోడ్డుకు దాత సహాయంతో మరమ్మతు పనులు చేపట్టారు. షాద్‌నగర్ ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి ఉన్న రోడ్డు పైన గుంతలు, అలాగే రోడ్డుకు ఇరువైపుల కంప చెట్లు పెరిగి రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల రోడ్డు పైన వెళ్తున్న వాహనదారుడు ముందు వస్తున్న వాహనం కనిపించకపోవడంతో ఆ వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటుండంతో గ్రామానికి చెందిన చాకలి నర్సింలు ముందుకు వచ్చి రోడ్డు పైన గుంతలతో పాటు, రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను జెసీబీ సహాయంతో తొలగించాడు. ఈ కార్యక్రమంలో లెంకపోతుల సత్యంగౌడ్, శివనంద్, కుమ్మరి శేఖర్, హన్మంతు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



గుంతలను పూడ్చివేయిస్తున్న నర్సింలు

బాధ్యతలు చేపట్టిన సీఐ సుధాకర్

పహాడీషరీఫ్: బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.సుధాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సుధాకర్ గతంలో పహాడీషరీఫ్, బాలాపూర్ ఠాణాలో ఎస్ఐగా పనిచేశారు. 2016లో పోలీస్ స్టేషన్ల పునర్విభజనతో పహాడీషరీఫ్ నుంచి నూతనంగా ఏర్పడిన బాలాపూర్ ఠాణాకు కొంతకాలం ఎస్ఐ ర్యాంక్‌తో ఎస్‌హెచ్ఓగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యమని, ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.



శంకర్‌పల్లి: గీతామందిరంలో బతుకమ్మ ఆడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మితదితరులు

సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ

చేవెళ్ల, షాద్‌నగర్ పరిధిలో మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను సిద్ధం చేసి ఒకచోట ఉంచి బతుకమ్మ ఆటలు ఆడారు. పలు కాలనీలలో మహిళలు బతుకమ్మ ఆడి, పాడి సంబరాలు చేసుకున్నారు. చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయానికి ప్రతికా బతుకమ్మ అని పేర్కొన్నారు.



చేవెళ్ల: న్యూ జర్నలిస్ట్ కాలనీలో బతుకమ్మతో చిన్నారి



చేవెళ్ల: మల్కాపూర్ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్

చేవెళ్ల: వ్యాధులు సోకకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని పామెన గ్రామానికి చెందిన యువకుడు, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ తన సొంత డబ్బులతో దోమల మందు స్ప్రే చేయించారు. బుధవారం గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే విషయం తన దృష్టికి రావడంతో తన సొంత డబ్బులు వెచ్చించి పంచాయతీ కార్మికునితో గ్రామంలో ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు పారిశుద్ధ్యం లోపించి రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దోమలు స్వైర విహారం చేస్తూ రాత్రిళ్లు కుట్టుతున్నాయన్నారు. దీంతో ప్రజలు మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. పారిశుద్ధ్యం విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణమోహన్ చేస్తున్న పనిని గ్రామస్తులు అభినందించారు.



ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు ఆహ్వానం

బడంగ్‌పేట్: 23వ డివిజన్‌లో ఈ నెల 16న బీరప్ప దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణోత్సవానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానించారు. బుధవారం కుర్మసంఘం నాయకులు ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందచేశారు. వీరితో పాటు ఎమ్మెల్యే సబితారెడ్డి, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని ఆహ్వానించారు. సంఘం నాయకులు గౌర సాయికుమార్, నాయకులు భీమిడి జంగారెడ్డి, కర్రె బల్వంత్, నందినేని నరేందర్‌రెడ్డి, సామ దర్శన్‌రెడ్డి, గట్టు మహిపాల్, భీమా, జగదీష్ తదితరులు ఉన్నారు.

తెల్ల కుసుమ విత్తనాల పంపిణీ

షాబాద్: రైతులకు తెల్ల కుసుమ విత్తనాలు పంపిణీ చేసినట్లు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ గ్రామాల్లో రైతులకు కుసుమ విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ నూనె గింజల పరిశోధన స్థానం రాజేందర్‌నగర్ వారి సహకారంతో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెల్ల కుసుమ సాగు చేసేందుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. రైతులకు తెల్ల కుసుమ సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐ ఓ ఆర్ టెక్నీషియన్ నందిశ్వర్, రైతులు చంద్రారెడ్డి, మల్లయ్య, చెన్నయ్య, రాంచంద్రయ్య, మాధవరెడ్డి, యాదవరెడ్డి, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న రత్నాకర్

యువత క్రీడల్లో రాణించాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: యువత క్రీడల్లో రాణించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెలిజర్ల గ్రామ పంచాయితీ కాలనీ తండాలో బాబు నాయక్, శివ ఏర్పాటు చేసిన సీపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. యువతకు చదువు ఎంత ముఖ్యమో, క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించి సత్తా చాటాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, ఇలాంటి టోర్నీలతోనే యువత ప్రతిభను ప్రదర్శించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్నాతి శ్రీనివాస్, లష్కర్ నాయక్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, బాబు నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం ఆశయ సాధనకు కృషి

ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు భిక్షపతి

షాద్‌నగర్ రూరల్: కాన్షీరాం ఆశయ సాధనకు కృషి చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచాల భిక్షపతి పేర్కొన్నారు. బుధవారం కాన్షీరాం వర్ధంతిని షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన కాన్షీరాం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్నో పోరాటాలు చేశారన్నారు. నవంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గంట్లవెళ్లి రాకేష్, జిల్లా కో కన్వీనర్లు మహ్మద్‌పాషా, నర్సింహా, మల్లేష్, రాజు, రవీంద్ర, రవీందర్, నరేష్, రవి, రాజు, శివ, యాదయ్య, రామస్వామి, శివ, చిన్నయ్య, రెడ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్

కేశంపేట: అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలను ఆపేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల సహకారంతో బీఆర్‌ఎస్ నాయకులను ముందుస్తు అరెస్టు చేయడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులతో రైతు ఉద్యమాన్ని ఆపలేరని ఆయన తెలిపారు. కొడంగల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ రైతు పాదయాత్రకు వెళ్లేందుకు సిద్ధమైన మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, మురళీ యాదవ్‌లను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మసిటీ కోసం చేపడుతున్న భూ సేకరణకు అక్కడి ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. ప్రజలకు మద్దతుగా బీఆర్‌ఎస్ చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డకోవడం బాధాకరమన్నారు.



గృహనిర్బంధంలో నాయకులు

ఉద్యమకారుల ఫోరం కన్వీనర్‌గా మహేశ్వర్‌రెడ్డి



చేవెళ్ల: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్‌ని యోజకవర్గం కన్వీనర్‌గా యాలాల మహేశ్వర్ రెడ్డిని ఎంపిక చేశా రు. బుధవారం నగరంలోని ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండో సారి యాలాల మహేశ్వర్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో పనిచేసిన ఉద్యమకారులను గుర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అందరికీ పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తనను కన్వీనర్‌గా ఎంపిక చేసిన చీమ శ్రీనివాస్, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



చైర్‌పర్సన్ హేమలత దంపతులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

తుక్కుగూడ: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.పాపయ్యగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో భారీగా సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అని, 18 సంవత్సరాలు నిండిన యువతకు సభ్యత్వం అందజేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ముఖ్యంగా మహిళలను రాజకీయంగా చైతన్యం పర్చాలన్నారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసిన హర్యానా ప్రజలు.. పార్టీకి మరోసారి అధికారం ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం నూతన చైర్‌పర్సన్ బరిగల హేమలత దంపతులను కమలనాథులు సన్మానించారు. ము న్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్ రాజమౌని రాజు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం

జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి

షాబాద్: రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యమని జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో బూత్ అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, నరేష్‌లతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. దేశంలో బీజేపీని అతి పెద్ద రాజకీయ పార్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరు మాణేయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదే మహేశ్, దళిత మోర్చా అధ్యక్షుడు మహేందర్, మండల ఉపాధ్యక్షుడు అనంతం, సురేష్, పాల్గొన్నారు.



షాద్‌నగర్: ఎల్లంపల్లిలో సభ్యత్వ నమోదు ప్రారంభించిన వెంకటేష్‌గుప్తా

షాద్‌నగర్‌లో....

షాద్‌నగర్: వికసిత్ భారత్ బీజేపీ లక్ష్యమని జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్‌గుప్తా మాట్లాడుతూ... మూడో సారి కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రధాని మోడీ అభివృద్ధి, సంక్షేమం, దేశ రక్షణ కోసం అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. గున్న రాంచంద్రయ్య, గున్న శ్రీశైలం, రమేష్, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: తాళ్లపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు